హైదరాబాద్ వార్త



# 2న కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

## -గోషామహల్‌లో చురుకుగా సాగుతున్న ఏర్పాట్లు

**గోషామహల్, నవంబర్ 29(ప్రభాతవార్త):** నూతనంగా తలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణ శంఖుస్థాపనకు వైద్యఆరోగ్యశాఖ గోషామహల్ పోలీస్‌స్టేడియంలో చురుగా ఏర్పాట్లు చేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదావు ఏడాది కావస్తుంది. గోషామహల్‌లోని పోలీస్ క్వార్టర్స్‌తోపాటు గ్రౌండ్‌ను స్థలం సుమారుగా 30 ఏకరాల స్థలం ఉందని ప్రభుత్వానికి నివేదికను అందచేశారు. గత ఆగస్టు మాసంలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెరుగుతున్న రోగులకు అనుగుణంగా నూతన ఆసుపత్రి నిర్మాణభవనాన్ని గోషామహల్ పోలీస్‌స్టేడియంలో నిర్మించేందుకుగాను ప్రకటించారు. ఈనేపథ్యంలో వైద్యఆరోగ్య శాఖనూతన భవన నిర్మాణం ప్లానింగ్, ఆర్కిటెక్చర్ ప్రణాళికలంతా బెంగూళూరుకు చెందిన ఓ అర్కిటెక్ట్ చేత డిజైన్‌చేస్తున్నారని తెలిసింది. పదిలక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త ఆసుపత్రి భవనానికి నిర్మించేందుకుగానుప్రణాళికను ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం నూతన ఆసుపత్రి నిర్మాణం చేయాలంటే సుమారుగా 500కోట్లుఅవసమవుతాయని ఇంజనీరింగ్ నిపుణులు తెలుపుతున్నారు. ఆసలే రాష్ట్రం పూర్తిగా ఆర్దిక పరిస్థితి అంతంతా మాత్రంగానే ఉందని, చివరకు సచివాలయంలో అధికారుల సెల్‌ఫోన్లు చార్జింగ్ కూడా పొదుపుగా వాడుకోవాలనిఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మంత్రులు, ఐఎఎస్. ఐపిఎస్‌లు విదేశీ పర్యటలను కూడా రద్దు చేస్తున్నట్లుప్రకటించారు. పొదుపు పై దృష్టి సారించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్జల్‌గంజ్‌లోని ఉస్మానియా ఆసుపత్రిపాతభవనానికి మరమ్మత్తులు చేయిస్తే సుమారుగా 50 సంవత్సరాల వరకు రోగులకు, వైద్యులకు అందుబాటులో వస్తుందని ఇంజనీరింగ్ నిపుణులు అంటున్నారు. ఒక వేళ పోలీస్‌స్టేడియంలో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన తరువాత పాత ఉస్మానియా ఆసుపత్రి తరహాలో పనులు నిలిచి పోకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం, భాద్యత ప్రభుత్వంపై ఉంది.

**-అప్పట్లో ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్...**

పెరుగుతున్న రోగులకు అనుగుణంగా ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలో సరిపోవడంలేదని కొత్త భవనం నిర్మాణం చేయాలని వైద్యులు, వైద్య యూనియన్ నాయకులు అప్పట్లో ముఖ్యమంత్రిగా కొనసాగి కెసిఆర్‌కు విన్నవించారు. వైద్యశాఖ ఆరోగ్యశాఖ, వివిధ విభాగాల అధికారులతో ముఖ్యమంత్రిగా కొనసాగి కెసిఆర్ ఏకంగా ఉస్మానియా ఆసుపత్రిన్ని సందర్శించి ఏకంగా మూడున్నర ఖాళీ స్థలంలో (ట్విన్స్ టవర్లు) నిర్మించేందుకుగాను ప్రణాళికలనురూపొందించాలని సంబంధిత వైద్యఆరోగ్యశాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రిగా కొనసాగిన కెసిఆర్ ఆదేశాలను సంబంధిత అధికారులు భేఖాతరు చేశారు. నూతన ఆసుపత్రినిర్మాణం ఒక అడుగు ముందుకు, ఒక అడుగు వెనక్కి అనే చందంగా మారింది. చివరకు అధికారమే కోల్పోయింది. టవర్లు లేవు, ఉన్న పాతభవనాన్ని వర్షం సాకు చూపి ఏకంగా పాతభవనాన్ని మూసివేసి దాదాపుగా 7సంవత్సరాలు దాటింది. ఇదండి సంగతీ మన పాలకులు, ప్రజాప్రతినిధుల తీరు

**జెఎన్‌టియు నివేధిక పరిగణలోకి తీసుకోవాలి....**

చారిత్రాత్మకమైన ఉస్మానియా ధర్మాసుపత్రి భవనం మరమ్మత్తులు చేయకుంటే రెండునుంచి మూడు సంవత్సరాలోపు ఎప్పుడైనా ఏ సమయంలోనైనా పేకమేడల కూలిపోయే ప్రమాదముందని అటు వైద్య అధికారులను, ఇటు ప్రభుత్వాన్ని హెచ్చరించిదని అప్పట్లో సాక్షాత్తు ప్రభుత్వమే ప్రకటించినట్లు తెలిసింది. రోగులకు వైద్యం అందిస్తున్న పాత భవనాన్ని ప్రమాదస్థితిలో ఉందని సాకు చూపి ఏకంగా పాత ఆసుపత్రి భవానిన్ని మూసి దాదపుగా ఏడు సంవత్సరాలు అవుతుంది. లేని పక్షంలో కూలిపోతుందని తప్పుడు సమాచారం, తప్పుడు నివేధికలను అందచేసి పేద రోగులకు వైద్యం అందకుండా చేశారు. ఆసుపత్రికి మరమ్మత్తులు చేస్తే మరో 50 సంవత్సరాలు ఉంటుందని చెప్పడాన్ని కూడా పరిగణిలోకి తీసుకోవాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉంది. ఆసుపత్రిని మరమ్మత్తులు చేస్తూ ప్రక్కనే ఖాళీగా ఉన్న రెండున్నర ఎకరాల స్థలంతోపాటు మరోమూడున్నర ఎకరాల నర్సింగ్‌హాస్టల్, స్కూల్ భవనాన్ని స్వాధీనం చేసుకుని కూల్చి వేస్తే ఆరు ఏకరాల స్థలం ఏర్పడుతుంది. ఆరు ఏకరాల స్థలంలో గత ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన డిజైన్ ప్రకారం జిప్లస్ 7అంతస్థుల భవనం నిర్మిస్తే పాతభవనంలో ఉన్న వార్డులతోపాటు ఆపరేషన్‌కు సంబంధించిన పరికరాలను తరలివచ్చునని ఇంజనీరింగ్ అధికారులు తెలుపుతున్నారు.

**-ప్రభుత్వానికి ఎవరు చెప్పారో ఆలోచన....**

పాత ఉస్మానియా ఆసుపత్రి భవనానికి నలువైపులా పెద్ద రోడ్లు ఉన్నప్పటికి తరుచుగా ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. అలాంటి గోషామహల్ పోలీస్‌స్టేడియం కేవలం స్థలం సక్రమంగా ఉన్నప్పటికి రహదారులు మాత్రం ఇరుకు రహదారులుగా ఉన్నాయి. ఇక్కడ ఆసుపత్రి నిర్మాణం చేపడితే తరుచుగా ట్రాఫిక్ కలుగుతుందని స్థానికులు అంటున్నారు. జననివాసాల మధ్య ఆసుపత్రి నిర్మించడ ద్వారా స్థానిక ప్రజలకు అనేక ఇబ్బందులు కలిగేప్రమాద ముందన్నారు. చిన్న పాటి వర్షం కురిస్తేనే గోషామహల్ పోలీస్‌స్టేడియం పరిసరాల ప్రాంతాలు వర్షనం నీటితో ప్రజలు అనేక అవస్థలకు గురవుతుంటారు. దీనికి తోడు భారీ వర్షాలు కురిసిన సమయంలో ఎత్తు ప్రాంతాలైనఅప్జల్‌సాగర్, దత్తాత్రేయనగర్, మల్లేపలి, సీతారాంబాగ్‌ల మీదుగా గోషామహల్ పోలీస్‌స్టేడియం అనుకుని ఉన్న పెద్ద నాళా తరుచుగా పొంగిపోర్లుతూ లోతట్టు ప్రాంతాలను ముంచి వేస్తుంది. కొత్త ఆసుపత్రిన్ని నిర్మిస్తే రోడ్డు కనెక్టివిటి సరిగా లేదు. ప్రధాన వ్యాపార వాణిజ్య కేంద్రాలైన ఫీల్‌ఖానా, బేగంబజార్ ప్రాంతాలు కూడా కొద్ది దూరంలో ఉండటం మూలంగా తరుచు ట్రాఫిక్ జాం కలుగుతుంది. ఏడాదిలోపే గోషామహల్ పోలీస్‌స్టేడియం అనుకుని కొద్ది దూరంలో ఉన్న నాళాలు అకస్మాత్తుగా కూలిపోయిన దాఖాలు కూడా ఉన్నాయి. ఎంతో పేరు గాంచిన శివకుమార్‌లాల్ పోలీసు స్టేడియంలో ఆసుపత్రిన్ని నిర్మించడాన్ని పోలీసులు కూడా అంతర్గతగా ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్నారు. ఆసుపత్రిన్ని నిర్మించేందుకుగాను పోలీసులకు చెందిన స్థలామే దొరికిందా అని పోలీసులు అంతర్గతంగా అగ్రహాం వ్యక్తం చేస్తున్నారు.

# చలి పంజా..!

## -హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్



**హైదరాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త**

నగరంలో చలి పంజా విసురుతోంది. శివారు ప్రాంతాల్లోనూ చలి తీవ్రంగా ఉంది. పగలు, రాత్రి అనే తేడా లేదు. ఎండ కాస్తున్నా..చలి మాత్రం తగ్గడం లేదు. ఉదయం వేళలో 8 గంటల వరకు కూడా రోడ్లపైన జనాలు కనిపించడం లేదు. సాయంత్రం 6గంటల తర్వాత బయటికి వెళ్లాలంటేనే వణికిపోతున్నారు ప్రజలు. శీతల గాలులు తోడవ్వడంతో జనం చలితో వణికిపోతున్నారు. శుక్రవారం నగరంలో కనిష్ట ఉష్ణోగ్రత 15.73 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవ్వగా..గరిష్ట ఉష్ణోగ్రత 23.9 డిగ్రీల సెల్సియస్‌గా ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్‌లో చలి తీవ్రత పెరగడంతో ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

**వాతావరణంలో అనూహ్య మార్పులు..**

చలికాలం రానే వచ్చింది. చలికాలం తనతో పాటు అనేక రోగాలను కూడా వెంట తీసుకొస్తుంది. చలికాలం వచ్చిందంటే చాలు జలుబు, దగ్గు, సీజనల్ జ్వరాలు మనల్ని ఇబ్బందులు పెడుతుంటాయి. చలికాలంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటంతో రోగనిరోధకశక్తి బలహీనంగా మారుతుంది. న్యుమోనియా, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాస సంబంధిత వ్యాధులకు దారితీసే ప్రమాదముంది. కొన్నిరోజులుగా నగరంలోవాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య క్రమక్రమంగా పెరగుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై మరింత దృష్టి సారించాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. చలికాలంలో వృద్ధులు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ధనుంజయ సూచించారు. దగ్గు, జలుబు, ఆస్తమా వంటి వ్యాధులపై నిర్లక్ష్యంగా ఉంటే ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, హృద్రోగ సమస్యలు, ఇతరత్రా రోగాల బారిన పడే ప్రమాదం ఉంది హెచ్చరించారు. చల్లటి వాతావరణంలో కీళ్లనొప్పులు పెరుగుతాయని చెప్పారు. చలిలో వైరల్ ఫ్లూ ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, వ్యాక్సిన్ తీసుకోవటం ద్వారా రోగనిరోధకశక్తి పెంచుకోవచ్చని తెలిపారు.

**సరైన నిద్రతోపాటు నడక, వ్యాయామం ఎంతో మేలు :**

ఫ్లూ, న్యుమోనియా వ్యాధుల నుంచి కూడా రక్షణ పొందవచ్చు అని జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రాంప్రసాద్ వివరిం చారు. రక్తప్రసరణ మందగించి గుండె జబ్బులు పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ సమ యంలో వేడినీళ్ల తాగాలని, ఆవిరి పడుతూ శ్వాసనాళాలను శుభ్రం చేసు కోవాలని సూచించారు. పాలు, కూరగాయలు వంటి పోషకాలు, విటమిన్ సి ఉన్న పండ్లు తీసుకోవాలని పేర్కొన్నారు.

వృ ద్ధులు ఎక్కువగా విశ్రాం తి, తగినంత నిద్రపో వాలని తెలిపారు. సరైన నిద్రతో పాటు తేలికపాటి నడక, వ్యాయామం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

# జూ పార్కులోని జంతువుల ఎన్‌క్లోజర్ల వద్ద హీటర్లు ఏర్పాటు



జూ పార్కులోని పులి, పాములు వద్ద హీటర్లు ఏర్పాటు



జూ పార్కులోని ఎన్‌క్లోజర్ వద్ద హీటర్లు ఏర్పాటు

**చార్మినార్, నవంబరు 29 ప్రభాతవార్త :** శీతాకాలం సందర్భంగా జూ పార్కులోని జంతువులు, పక్షులు చలి బారి నుంచి కాపాడటానికి జూ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నగరంలో చలి తీవ్రత రోజు, రోజుకు పెరిగి పోతున్నది. చలి విపరీతంగా పెరుగు తున్నందున జూ పార్కులోని జంతువుల సంరక్షణ కోసం చలి కాలాన్ని పురస్కరించుకుని అన్ని చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని పులులు, సింహాలు, ఏనుగులు, ఖడ్గ మృగాలు, అడవి దున్నలు, జింకలు, పలు రకాల పక్షులు, పాములతో పాటు వివిధ రకాల వేలాది ఇతర జంతువులు, పక్షులు ఉన్నాయి. చలిని తట్టు కోవటానికి జూ పార్కులోని పులులు, సింహాలు, కోతులు, పాములు ఎన్‌క్లోజర్లు వెచ్చ దనం కోసం దాదాపు రెండు వందల హీటర్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఏనుగులు, అడవి దున్నలు, జిరాఫీ వద్ద వేప ఆకులు కాల్చి వేడి చేస్తున్నారు. వేప ఆకులను కాల్చటం వల్ల పొగ రావటంతో దోమలు బెడద తగ్గింది. నెమళ్లు, రామ చిలుకలు, పిచ్చుకలను చలి నుంచి కాపాడటానికి వేడి కోసం గూళ్ల చుట్టూ ఎండు గడ్డి, గోనె సంచులు కట్టారు.

జూ పార్కు కుచెందిన వెటర్నరీ వైద్యులు ప్రతీ రోజు జంతు వుల ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి జంతువుల ఆరోగ్య క్షేమాలను తెలుసుకుని వాటికి కావలసిన మందులు నీళ్లలో కలిపి అందజేస్తున్నారు. చలి కాలం సందర్భంగా జంతువులు, పక్షులు, నెమళ్లతో పాటు అన్ని ఎన్‌క్లోజర్ల వద్ద ఏర్పాట్లు చేశారు.

# కలలను సాకారం చేసిన నాయకుడు కెసిఆర్ : ఎమ్మెల్యే తలసాని



పాటిగడ్డ నుంచి బీఆర్ఎస్ భవన్‌కు బయలు దేరిన బైక్ ర్యాలీలో బైక్ నడుపుతున్న తలసాని

**బేగంపేట నవంబరు 29, ప్రభాతవార్త**

తెలంగాణా రాష్ట్ర ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కలను సాకారం చేసిన గొప్ప నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం దీక్షాదివస్ లో భాగంగా బేగంపేట పాటిగడ్డ నుంచి తెలంగాణా భవన్ వరకు సాగే భారీ బైక్ ర్యాలీని తలసాని ప్రారంభించారు. పాటిగడ్డ నుంచి తెలంగాణా భవన్ సమీపంలోని బసవతారకం హస్పిటల్ వరకు 5కిలోమీటర్ల దూరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బైక్ నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగానా రాష్ట్ర సాధన లక్ష్యంగా కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి రాష్ట్ర సాధన కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసారని గుర్తు చేసారు. అయినప్పటికీ నాటి పాలకులు స్పందించకపోవడంతో తెలంగాణా వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో 2009లో కరీంనగర్ జిల్లాలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని, అది తెలంగాణా ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలకు అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు పూర్తి మద్దతు తెలియజేసారని అన్నారు. ఎన్నో సంవత్సరాల కల తెలంగాణా రాష్ట్రాన్ని సాధించి కేసీఆర్ తెలంగాణా చరిత్రలో గొప్ప నాయకుడిగా నిలిచారని అన్నారు. ఆయన ఆమరణ దీక్ష చేపట్టి 15సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో దీక్షా దివస్ వేడుకలను జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో యువనాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, ఆకుల హరికృష్ణ, కొలను బాలిరెడ్డి, పవన్‌కుమార్ గౌడ్, పాల్గొన్నారు.

# సెప్టిక్ ట్యాంక్ కబ్జాను అడ్డుకోవాలని స్థానికుల ధర్నా

## - ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో సెప్టిక్ ట్యాంక్ కబ్జాను అడ్డుకోవాలని ఆందోళన చేస్తున్న స్థానికుల దృశ్యం

**నార్సింగి, నవంబర్ 29 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న 500.గజాల స్థలాన్ని కొందరు కబ్జా చేసి అపార్టుమెంట్ నిర్మించేందుకు హుడా నుంచి అనుమతులు పొందారు. కబ్జాదారులు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి అధికారులను బురిడీ కొట్టించారు. వెంకటేశ్వర కాలనీ మొత్తం 23.ఎకరాల 16గుంటల స్థలంలో లేఔట్ చేశారు. ఇందులో 34,011 స్క్వయర్ యార్డ్స్ స్థలంను రోడ్లు, 11, 337 స్క్వయర్ యార్డ్స్ స్థలం పార్కులు, ఓపెన్ ప్లేస్, సెప్టిక్ ట్యాంక్ కోసం వదిలేసి మిగితా 67.వేల స్క్వయర్ యార్డ్స్ స్థలంలో ప్లాటింగ్ చేశారు. పార్కు పక్కనే సెప్టిక్ ట్యాంక్ కోసం 500.గజాల స్థలంను వదిలిపెట్టారు. ఇటీవల భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు కబ్జాదారులు 336,337 ప్లాట్లుగా ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఏకంగా హుడా అధికారులతోనే జి+5 అపార్టుమెంట్ నిర్మాణంకు అనుమతులు పొందారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులంతా పార్కులను, సెప్టిక్ ట్యాంక్ స్థలాలను కబ్జా చేస్తున్నారని, ఆ స్థలాలను కాపాడాలని పలుమార్లు మణికొండ మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. కానీ ఎవరూ ఇప్పటి వరకు స్పందించలేదు. దీంతో అధికారులు, నాయకులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని గ్రహించిన కాలనీ వాసులు శుక్రవారం సెప్టిక్ ట్యాంక్ స్థలం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఉపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ కోసం వదిలేసిన స్థలం కాలనీ వాసులందరికి చెందుతుందని, దానిపై అధికారులు ఇచ్చిన అనుమతిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీ లేఔట్‌లో ఈ స్థలంలో ఎలాంటి ప్లాట్లు లేవని, పార్కు స్థలంగా చూపించడం జరిగిందని, మా వద్ద ఉన్న ఆధారాలను హుడా అధికారులు, హైడ్రా అధికారులకు అందజస్తామని స్పష్టం చేశారు. పందెన్‌వాగుకు ఆనుకొనే ఈ స్థలం ఉందని, నాలా పరిరక్షణలో భాగంగా ఈ స్థలాన్ని కాపాడాలని కోరుతూ హైడ్రా అధికారులకు కూడా ఫిర్యాదు చేయబోతున్నామని వివరించారు. ఆరు నూరైనా అక్రమ నిర్మాణాలను అడ్డుకొని తీరుతామని, చట్ట పరిధిలోనే ముందుకు వెళ్తామని ఉపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని లేదంటే కాలనీ వాసులమంతా కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కాలనీ వాసులు సందీప్, రాధిక, సుజాత, నర్సింలు, మల్లిఖార్జున్‌రెడ్డి, స్మితా, రాజారెడ్డి, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిధితో సంబంధం లేకుండా కేసుల నమోదుకు సిద్ధం కావాలి

**: సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి**



బాలానగర్ డీసీపీ కార్యాలయంలో సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న అవినాష్ మహంతి, సురేష్ కుమార్

**కుత్బుల్లాపూర్, నవంబర్ 29, ప్రభాతవార్త**

ఫిర్యాదుల ఆధారంగా పోలీస్ స్టేషన్‌ల పరిధులను సంబంధం లేకుండా కేసులు నమోదు చేసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి ఆదేశించారు. బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో డివిజన్ సర్కిల్ పరిధిలోని వివిధ పోలీసు అధికారుల సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని, గంజాయి క్రయ విక్రయాలపై శ్రద్ధ వహించాలని కేసుల విచారణలో ఆధునిక పద్ధతులను వినియోగించాలని సూచించారు. గత కొన్ని సంవత్సరాలు చట్టానికి దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. కేసుల సత్వర పరిష్కారానికి నాణ్యమైన విచారణతో వేగవంతం చేయాలని సూచించారు. నాన్‌బేయిలబుల్ వారెంట్లు ఉన్న ప్రతీ ఒక్కరిపై, అలాగే మిస్సింగ్ కేసులపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల అదుపు, మోసాల నివారణ, ఫోక్సో చట్టం అమలు, రౌడీయిజం, ఆస్తి సంబంధాల నేరాల అదుపుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరంగా ప్రస్తుతం నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రాఫిక్, సబ్‌స్టెన్స్ సెస్, సీసీ కెమెరాల సంఖ్యను పెంచేందుకు ప్రజల్లో చైతన్యం తేవాలని అన్నారు. ఈ సమావేశంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్ కుమార్, క్రైమ్ డీసీపీ నరసింహా, డీసీపీ పరిధిలోని వివిధ ఏసీపీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణ జీవవైవిధ్యాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

## -జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ



సదస్సులోపాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 29, ప్రభాతవార్త:**

పట్టణ జీవవైద్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. పట్టణ ప్రాంతాల్లో జీవవైవిద్య ప్రాముఖ్యత, జీవవైవిధ్యాన్ని కాపాడటం, సంరక్షించడం పై సామాజికంగా మరింత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆమె అన్నారు. జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, ఐ.సి.ఎల్.ఇ.ఐ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పట్టణ జీవవైవిద్యం పై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో భాగంగా శుక్రవారం బేగంపేటలోని తాజ్ వివంత హోటల్ లో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ఆరోగ్యకర నగరాలు, స్థిరత్వమైన పట్టణాభివృద్ధిలో పట్టణ జీవవైవిద్యం అత్యంత కీలకమైందన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో గాలి, నీటి నాణ్యత నుండి పట్టణ పర్యావరణ వ్యవస్థల మొత్తం స్థితిస్థాపకత వరకు ప్రభావితం చేస్తుందన్నారు. పట్టణ వ్యవస్థను మరింత పటిష్టంగా ఉండటానికి జీవవైవిధ్యం ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచ ఆర్థిక ఫోరం మేరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నగరాలు గ్లోబల్ జిడిపిలో 80 శాతం కంటే ఎక్కువ వాటా కలిగి ఉంటాయని అన్నారు. కానీ అదే సమయంలో మూడు వంతుల గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు ముఖ్యంగా ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు వంటి కేంద్రాల నుండి వస్తున్నాయని, డబ్ల్యు.ఈ.ఎఫ్ నివేదిక ప్రకారం దాదాపు 30 లక్షల కోట్ల రూపాయాల విలువైన ఆర్థిక కార్యకలాపాలు బయోడైవర్సిటీ లోపం వల్ల ప్రమాదంలో ఉన్నాయని అంచనా గలదన్నారు. అర్బన్ బయోడైవర్సిటీ పరిరక్షణలో హైదరాబాద్ నగరం గుర్తింపు పొందిందన్నారు. విభిన్న పర్యావరణ వ్యవస్థలు, పచ్చదనం పెంపు, ప్రకృతితో అనుసంధానం చేసే ప్రణాళికలు అమలు చేయడం ద్వారా ఇతర నగరాలకు హైదరాబాద్ మోడల్ గా నిలుస్తుందన్నారు. జీవవైవిధ్యాన్ని రక్షించడంలో, మెరుగుపర్చడంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. పచ్చని ప్రదేశాలను పెంచడం, సహజ ఆవాసాల ను పరిరక్షించడం, బయో కారిడార్ల ఏర్పాటు, జలాశయాల పరిరక్షణ, అర్బన్ బయోడైవర్సిటీ (యు.బి.డి విభాగం) ఆధ్వర్యంలో విస్తృత పూల తోటలు, పచ్చటి ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హెచ్.ఎం.డి.ఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధి ప్రణాళిక లో బయోడైవర్సిటీని ఒక అంతర్భాగంగా తీసుకోవడం అవసరమన్నారు. పచ్చదనాన్ని, ప్రకృతి ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించడంలో పట్టణ పాలక సంస్థల పాత్ర కీలకమన్నారు. బహుళ శాఖల మధ్య సమన్వయం కల్పించడంతో బయోడైవర్సిటీ పరిరక్షణలో మరింత పురోగతి సాధించవచ్చన్నారు

జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ ఛైర్ పర్సన్ సి.అచలేందర్ రెడ్డి మాట్లాడుతూ... బయోడైవర్సిటీ పునరుద్దరణకు భారత ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ విధానాలు, లక్ష్యాలు దేశంలో అర్బన్ ఏకో సిస్టంల పునరుద్దరణ లక్ష్యం కాగలదన్నారు.

ఈ సదస్సులో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ అడ్వైజర్ రఘు కుమార్ కొడాలి, జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ సెక్రటరీ డా.బి.బాలాజీ, డా. బిక్షం గుజ్జ, డా.జి.చంద్రశేఖర్ రెడ్డి, హరీష్ చంద్ర ప్రసాద్ యార్లగడ్డ, ఐ.సి.ఎల్.ఈ.ఐ అసోసియేట్ డైరెక్టర్ డా.మోనాలిస సేన్, డా.సాయిరాం రెడ్డి పాలిచెర్ల, సంజీవ్ కార్పే, రోజ్ కోట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నయాన్ బెన్ పెడాడియా, వివిధ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపల్ కమీషనర్లు, అటవీ శాఖ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, ఎన్జీఓలు పాల్గొన్నారు.

## ఆహారంలో నాణ్యత లేదని ఓ.యూలో రోడ్డెక్కిన విద్యార్థులు


రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న న్యూగోదావరి హాస్టల్ విద్యార్థులు

**తార్నాక, నవంబర్ 29 ప్రభాతవార్త:** హాస్టల్లో నాణ్యత లేని ఆహారం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు రోడెక్కారు. ఓ.యూలోని న్యూగోదావరి హాస్టల్ విద్యార్థులు తమ హాస్టల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యాత లేని ఆహారం అందిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తూ నీళ్ల చారు గిన్నెతో రోడ్డుపై పలువురు విద్యార్థులు బైటాయించారు. తమ సమస్యపై వీసి స్పందించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్ విద్యార్థుల వద్దకు వచ్చారు. ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా తమను పట్టించుకోవడంలేదని ఆయనపై మండిపడ్డారు. అనంతరం ఛీఫ్ వార్డెన్ మెస్‌గురించి ఆరా తీశారు. కుక్‌లకు జాగ్రత్తలు చెప్పారు. దీనిపై ఛీఫ్ వార్డెన్ స్పందిస్తూ ఇక నుంచి నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామి నివ్వడంతో వారు ఆందోళన విరమించారు.

## మాజీ మంత్రి కెటిఆర్‌ను కలిసిన చార్మినార్ బిఆర్ఎస్ నాయకులు


మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన చార్మినార్ నియోజకవర్గం సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషీ,

**చార్మినార్, నవంబరు 29 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్‌ను చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషీ ఆధ్వర్యంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ సాహిత్య అకాడమీ యువసాహితీకారుల రచనలు ఆహ్వానం

**రవీంద్రభారతి, నవంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ సాహిత్య అకాడమి ప్రతిష్టాత్మకంగా వెలువరిస్తున్న పునాస సాహిత్య త్రైమాసిక పత్రిక జనవరి-మార్చి 2025 సంచికను యువ సాహిత్యకారులచే ప్రత్యేకంగా తీసుకురావాలని భావిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి నమోజు బాలాచారి చెప్పారు. ఈమేరకు సాహితీ వ్యాసాలు; కథలు (అనువాద కథలు కూడా); కవితలు (అనువాద కవితలు కూడా)లను ఔత్సాహిక యువ సాహితీకారుల నుండి ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం మీడియాకు తెలిపారు. నిబంధనలు : 1. పంపే రచనలన్నీ స్వీయ రచనలని, ఇతర ఏ పత్రికలలోనూ, సోషల్ మీడియాలో ప్రచురించలేదని హామీపత్రం జతచేయబడిన రచనలు మాత్రమే ప్రచురణకు స్వీకరించడం జరుగుతుంది. 2. రచనల ఎంపికలో తుది నిర్ణయం తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ వారిదే. యువ సాహితీవేత్తలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వారి సృజనాత్మకప రచనలను విస్తృతం చేయాలనుకున్న అకాడమీ ఆకాంక్షను అందిపుచ్చుకొని తమ రచనలను డిసెంబరు 15, 2024లోపు క్రింది అడ్రసుకు పంపవలసినదిగా బాలాచారి కోరారు. రచనలు పంపవలసిన చిరునామా : ఎడిటర్, పునాస సాహిత్య త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్. ఈమెయిల్ : ఎడిటర్.పునాసఎట్‌దరేట్‌జీమెయిల్.కాం; మొబైల్ నంబరు : 9989260336ను సంప్రదించాలని అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి సూచించారు.

## కంటోన్మెంట్ విలీనానికి ప్రభుత్వం సానుకూలం : శాంతకుమారి


ప్రభుత్వ సీఎస్ శాంతకుమారితో బేటీ అయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్నీ జిహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి సానుకూలంగా స్పందించినట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం సీఎస్ శాంత కుమారితో సమావేశమైన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ సంస్థ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ మాట్లాడుతూ కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో మర్జింగ్ చేసేందుకు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. వచ్చే నెల 4న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులతో మర్జింగ్ అంశంపై ఎసమావేశం జరగనున్నట్లు ఆయన తెలిపారు.

## కంటోన్మెంట్‌లో టిడిపిని బలోపేతం చేయాలి : నర్సింగ్


5వ వార్డు ఖాకగూడలో టీడీపి సభ్యత్వాన్ని ప్రారంభించిన జనగాం నర్సింగ్ తదితరులు

**కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో టీడీపిని బలోపేతం చేయాలని కంటోన్మెంట్ నియోజకవర్గం టీడీపి హడక్ కమిటీ మెంబర్ జనగాం నర్సింగ్ రావ్ తెలిపారు. శుక్రవారం 5వ వార్డుఖాకగూడలో రవిందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపి సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపి నాయకులు అనురాధ, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

**చార్మినార్, నవంబరు 29 ప్రభాతవార్త :** పాతబస్తీ పురానాపూల్ వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తి మృత దేహం లభించిన సంఘటన కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ కథనం ప్రకారం....పాతబస్తీ పురానాపూల్ హసన్ ఫీర్ దర్గా వద్ద గుర్తు తెలియని నలభై ఐదు సంవత్సరాల వ్యక్తి మృత దేహం పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురిలో భద్ర పరిచారు. మృతుని దేహంపై గోల్డ్ బ్రౌన్ చెక్స్ షర్టు, బ్లాక్ కలర్ ఫ్యాంటు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు 8712571603 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.


మాట్లాడుతున్న మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సెట్విన్ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్



దీక్షా దివస్ సందర్భంగా నినాదాలు చేస్తున్న తెలంగాణ న్యాయవాదులు


ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట దీక్షా దివస్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు


కంటోన్మెంట్ నుంచి బైక్ ర్యాలీతో తరలివెళ్తున్న నివేదిత సాయన్న, జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు


రామ్‌నగర్ చౌరస్తా వద్ద అమరవీరులస్థూపానికి నివాళులు అర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

# కెసిఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ ఆవిర్భావం

**గండిమైసమ్మలో...**

**దుండిగల్, నవంబర్ 29 ప్రభాతవార్త:** గండిమైసమ్మలోని భారస జిల్లా కార్యాలయంలోని జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షదివాస్ కార్యాక్రమానికి శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య ప్రభుత్వాల పాలనలో అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతం అభివృద్ధి స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమవుతుందని బావించిన కెసిఆర్ తెలంగాణ వచ్చుడో..కెసిఆర్ సచ్చుడో అనే నినాదంతో అన్ని వర్గాలను ఏకం చేస్తూ 29నవంబర్2009న అమరణ నిరాహారదీక్షను ప్రారంబించిన రోజే దీక్షాదివాస్ అన్నారు. 60ఏళ్ళ కాలంలో అన్ని రంగాల్లో వివక్షకు గురై ధ్వంసమైన తెలంగాణ ప్రాంతాన్ని కేంద్రం మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రంగా సాధించడమే కాకుండా అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే దేశ తలసరి ఆదాయాన్ని మించిన ఆదాయంతో అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంటు ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, మాధవరం క్రిష్ణారావు, మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంబిసి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కంటోన్మెంట్ నియోజకవర్గంలో**

**కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** దీక్షా దివస్‌ను పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం నుండి టీఎస్‌బీసీఎల్ మాజీ చైర్మన్ గజ్జెలనగేష్ ఆధ్వర్యంలో కార్ఖానాలోని ఆర్కే ఫౌండేషన్‌లో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో పాటు వైద్య పరికరాలను అందజేశారు. అనంతరం దాదాపు 5వందల బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు రావుల సతీష్, జంగలి రాజ, యాసిన్, నిత్య, శివ, యాదగిరి, శ్రీనివాస్, మోసిస్ తదితరులు పాల్గొన్నారు.

**బహదూర్‌పుర నుండి...**

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 29 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ హయాంలోనే పాతనగరం అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించిందని మాజీ సెట్విన్ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్‌లు అన్నారు. బిఆర్ఎస్ పిలుపు మేరకు దీక్షా దివాస్ సందర్బంగా శుక్రవారం పాత బస్తీ బహదూర్‌పుర చౌరస్తా నుంచి బిఆర్ఎస్ భవనంకు బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్బంగా వారుమాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిందని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**దీక్షా దివస్ పాల్గొన్న న్యాయవాదులు**

**ముషీరాబాద్, నవంబర్ 29, ప్రభాతవార్త:** నాడు 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది రాయి పడిందని బీసీ కమీషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర, తెలంగాణ పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న న్యాయవాదులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కే.గోవర్ధన్‌రెడ్డి, రవికుమార్, సదానందం, రామచంద్రరావు, మంత్రి రవీంద్రరావు, సత్య నారాయణరెడ్డి, నరసింహచారి, పవన్ భిక్షమయ్య తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

**ఓ.యూలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో**

**తార్నాక, నవంబర్ 29 ప్రభాతవార్త:** కేసీఆర్ ఉద్యమ సమయంలో తీసుకున్న నిరాహార దీక్షా..... దీక్షా దివస్ తో తెలంగాణ గతిని మార్చిన రోజు అని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు డా.తుంగ బాలు పేర్కొన్నారు. శుక్రవారం దీక్ష దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఓ.యూలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు దీక్షకు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు తొట్ల స్వామి, కడారి స్వామి, కోతి విజయ్, శిగ వెంకటేష్, బురుగు నవీన్, గధరాజు చందు, కిరణ్ గౌడ్, పెద్దమ్మ రమేష్, క్రాంతి, మధు, జంగయ్య, రాజేష్ నాయక్, మిథున్, జీడీ అనిల్, కొంపెల్లి నరేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

**కంటోన్మెంట్ నుంచి తరలివెళ్లిన ర్యాలీలు**

**కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** దీక్ష దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బేవరేజెస్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేష్, మాజీ ఎమ్మెల్యే దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్‌లు 3 గ్రూప్‌లుగా ఏర్పడి బైక్ ర్యాలీ నిర్వహించి తెలంగాణ భవన్‌కు తరలి వెళ్ళారు.

**ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ**

బిఆర్ఎస్ దీక్ష దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ బారీ ఎత్తున నిర్వహించారు. ఈ ర్యాలీ సీతాఫల్ మండిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మీదుగా తెలంగాణ భవన్‌కు తరలివెళ్లింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, సత్తయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పొన్నాల రాజు, మోహన్, రామస్వామి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

**రామ్‌నగర్ చౌరస్తాలో...**

**చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:** కెసిఆర్ తన ప్రాణాలను పణ్ణంగా పెట్టి ఆమరణ నిరాహారదీక్ష చేపట్టడం మూంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం దీక్షాదివస్‌ను పురస్కరించుకుని రామ్‌నగర్ చౌరస్తా వద్ద అమరవీరులస్థూపానికి నివాళులు అర్పించి తెలంగాణ భవన్‌వరకు సాగే బైక్ ర్యాలీని ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, యువనేత ముఠాజైసింహా, డివిజన్ పార్టీ అధ్యక్షులు ఎం.రాకేశ్, శంకర్ మూదిరాజ్, వల్లాల శ్యామ్‌యాదవ్, నేతలు బి.సుధాకర్‌గుప్త, నేతా శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠానరేష్, ఎయిర్‌టెల్ రాజు, నీలాదేవి, తులసీ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలోని సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కలిసిన నేతలు

**నార్సింగి, నవంబర్ 29 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక నిర్వహించి త్వరగా పూర్తి చేయాలని మంత్రిని కోరామన్నాడు. అలాగే మూడు లక్షల జనాభా ఉన్న మణికొండ మున్సిపల్ పరిధిలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని, రేడియల్ రోడ్డు కనెక్టివిటిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇబ్రహీంభాగ్, నెక్‌నాంపూర్ చెరువులకు మిషన్ కాకతీయ కింద రూ.28.కోట్లు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలన్నాడు. అశోక్ లివియానో అపార్ట్‌మెంట్ వాటర్ కనెక్షన్ పెండింగ్‌లో ఉందని, ఫీజు కట్టినా కూడా ఆపారని, వెంటనే కనెక్షన్ ఇప్పించాలని విన్నవించామన్నారు. హాల్మార్క్ వీసినియా దగ్గర ఆర్ఎంసి ప్లాంట్లను తొలగించాలని, పార్టీ పటిష్టత కోసం కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలను మరువకూడదని మంత్రిని కోరినట్లు జితేందర్ వివరించారు. మా విన్నపాలపై మంత్రి శ్రీధర్‌బాబు వెంటనే స్పందించారని త్వరలోనే మణికొండలోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కిరణ్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, ముత్యాలు, మహేష్‌రెడ్డి, శ్రవణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మణికొండ కాంగ్రెస్ నాయకులు.

## ఆధునిక ప్రపంచ రూపు రేఖలు మారుస్తున్నారు : డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

**అఫ్జల్‌గంజ్, నవంబర్ 29ప్రభాతవార్త:** విజెటిఐ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌ద్వారా ఇన్నోవేషన్ ఇన్ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్‌పై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. జెఎన్‌టియూహెచ్, ఈసిఈ ఎమిరిటిస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ప్రతాప్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్బంగా డాక్టర్ ఎల్.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మొబైల్ కమ్యూనికేషన్ మోడ్‌లతరాలు, తాజా పురోగతులను వివరించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌ఆధునిక ప్రపంచ రూపురేఖలను ఎలా మార్చిందో వివరించారు. కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ కమ్యూనికేషన్ ఇన్ఫర్మేటిక్స్‌లో వివిధ పురోగతి గురించి వివరించారు. నాణ్యమైన ప్రచురణలు పేటేంట్లు ద్వారా సంస్థ విశ్వసనీయతను కొలుస్తారన్నారు. ప్రిన్సిపల్ సాయిబాబారెడ్డి ఐసిఐసిఐ 2024 కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ ఎం.రాజేంద్ర ప్రసాద్‌లు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేషన్స్ ఇన్ కమ్యూనికేషన్ ఇన్ఫర్మేటిక్స్ ప్రతినిధులకు హైబ్రిడ్‌మోడ్‌లో పేపర్‌లను సమర్పించేందుకుగాను అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. జేఎన్‌టియూహెచ్, ఈసిఈ ఎమిరిటస్ డాక్టర్ ఎల్.ప్రతాప్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పల్లా రాజేశ్వరరెడ్డితో కలిసి కాన్ఫరెన్స్ సావనీర్‌ను ఆవిష్కరించారు. విజెటిటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి, అక్రిడిటేషన్స్, డీన్ డాక్టర్ ఎ.పద్మజ, అకమిక్ కోఆర్డినేటర్ ఎం.శ్రీలత, సీనియర్ ఏఓ ఆర్.వెంకటాచలం, ఐసిఐసిఐ 2024 కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ ఎం.రాజేంద్ర ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ ఎస్.తలసి ప్రసాద్‌లతోపాటు పలువురు ప్రముఖులతో పాటు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు నుంచి దయాస్ నుంచి ప్రముఖులు ముఖ్యవక్తలు కాన్ఫరెన్స్‌లో ప్రసంగించారు. ఈసిఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న విజెటిఐ కళాశాల కరెస్పాండెంట్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

## సమాజంలోని అసహజ సంఘటనలపై పోరాటం చేయాలి

**"హక్కు" పోస్టర్ ఆవిష్కరణలో తమ్మారెడ్డి భరద్వాజ**

**హైదరాబాద్, నవంబర్ 29, ప్రభాతవార్త:** సామాజిక బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ సమాజంలో జరిగే అసహజ సంఘటలపై పోరాటం జరిపినపుడే సమాజం సక్రమార్గంలో పడుతుందని సినీదర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మరో సినీనటులు శివబాలాజీ గారితో కలిసి "హక్కు" పోస్టర్, లోగో, మరియు మిస్డ్ కాల్ నెంబర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రజాప్రతినిధులను ప్రజలు స్వచ్ఛందంగా ఎన్నుకునే స్వేచ్ఛ ఉండేది. ఇపుడు ప్రతీదీ డబ్బుతో ముడిపడివుంది అని అన్నారు. ప్రజల్లో చైతన్యం తెచ్చి వారి హక్కులు వారికి దక్కేలా హక్కు సంస్థ కృషి చేయాలన్నారు. నటులు శివబాలాజీ మాట్లాడుతూ పరివర్తన అనేది మనలో ఎవరోఒకరినుండి మొదలవ్వాలని దాన్ని మిగతావారూ అనుసరించాలన్నారు. తాను ఎన్నో సార్లు రోడ్డులో వెళ్ళేటపుడు బండ్లు అడ్డదిడ్డంగా నడిపే వారు, ఆటోవాళ్ళు పెద్దపెద్ద రాడ్లువేసుకుని ఓవర్ లోడుతో కనబడటంవంటివి నన్ను పోలీస్ స్టేషనుకువెళ్ళి ఫిర్యాదు చేసేంతగా ప్రేరేపించేవి. ఇకపై ఇలాంటి సంఘటనలు ఎదురైతే తప్పక నేనూ నా హక్కుగా భావించి కంప్లైంట్ చేస్తాను అన్నారు. హక్కు ప్రతినిధి వివేక్ గారు మాట్లాడుతూ నియమాలు పాటించేవారు, నియమాలు పాటించనివారికి బానిసలుగా మారారన్నారు, మంత్రుల ఖర్చులకు మధ్యతరగతి ప్రజలు పన్నులరూపంలో చెల్లిస్తున్నారు. ఎక్కడమాసినా భూ మాఫియా, లిక్కర్ మాఫియా మరెన్నో విషయాలు రోజూ వింటూనే అన్నీ చూస్తున్నామన్నారు. అలాంటి వీటిపై గళంవిప్పడానికే హక్కు ఇనిషియేటివ్ ఉద్భవించింది. ఇక హైదరాబాద్ ప్రజలను ఎవ్వరూ బెదిరించలేరు అణగదొక్కలేరని హక్కు ఇనిషియేటివ్ ముఖ్యంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై పోరాడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధి వర్గీశ్, పర్సనాలిటీ డెవలప్మెంట్ నిపుణురాలు మంజుశ్రీ, హక్కు ప్రతినిధులు వివేక్, సుధీర్, రాహుల్ వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.



హక్కు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వివేక్, మంజుశ్రీ, శివబాలాజీ, తమ్మారెడ్డి భరద్వాజ, వర్గీశ్ తదితరులు

## పదవి బాధ్యతలు చేపట్టిన స్మిత సబర్వాల్‌కు శుభాకాంక్షలు

**సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్ర పర్యాటక శాఖ నూతన కార్యదర్శిగా శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టిన సిత్మా సబర్వాల్‌ను ఆ శాఖ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, నాయకులు బల్విందర్, ప్రసాద్, రాజుయాదవ్, వెంకన్న, రవి తదితరులు కలిసి బోకె అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె ఆధ్వర్యంలో రాష్ట్రంలో పర్యాటక శాఖ మరింతగా అభివృద్ధి చెందగలదన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

## కంటోన్మెంట్ డిపోలో ఘనంగా వనభోజన వేడుకలు


కంటోన్మెంట్ డిపోలో వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్.ఎం.రాజశేఖర్ తదితరులు

**కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ డిపోలో ఆర్టీసి ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమాన్ని సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.ఎం. మాట్లాడుతూ ఆర్టీసి సంస్థను లాభాల బాటలో తెచ్చేందుకు ఆర్టీసి ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్.ఎం. బి.బి.రెడ్డి, కంటోన్మెంట్ డిఎం సుధాకర్ రావ్, సిఐ శ్రీపతి క్రిష్ణ, ఎం.ఎఫ్.బాల్‌రాజ్, మెంబర్లు దయాకర్, సంజీవరెడ్డి, నాగరాజు, చక్రవర్తి, శ్రీనివాస్, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

## పదవతరగతిలో వంద మార్కుల విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలుచేయాలి

**- రాష్ట్ర స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి**

**ముషీరాబాద్, నవంబర్ 29, ప్రభాతవార్త:** పదవ తరగతిలో వంద మార్కుల విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే.అనిల్‌కుమార్, కోశాధికారి కే.శ్రీకాంత్‌రెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం చాలా వరకు పూర్తి అయిపోతోందని, పాత విధానంలోనే విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు కాబట్టి ఇప్పుడు కొత్త విధానం అంటే విద్యార్థులు గందరగోళ పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా నూతన విధానాన్ని తీసుకురావటం అందరికీ ఇబ్బందికరంగా ఉందని అన్నారు. ఈ మార్కుల విధానం వల్ల బడ్జెట్ పాఠశాలలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను కూడా సంప్రదించి వారి సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

**తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగల భీభత్సం..**

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 29, ప్రభాతవార్త**

తాళం వేసిన ఇండ్లనే టార్గెట్ చేస్తూ దొంగల భీభత్సం సృష్టిస్తున్నారు. ఇవాళ భూపాలపల్లిలో జరిగిందే.. కూకట్‌పల్లిలో కూడా జరగడంతో పోలీసులకు సవాల్‌గా మారింది. తాళం వేసిన ఇంటిలో దొంగలు చొరబడి దొరికినకాడికి దోచుకొని పరార్ అయ్యారు. శుక్రవారం ఉదయం వచ్చిన ఇంటి యజమాని తలుపులు తెరిచి ఉండటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు మధుసుదన్ రావు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జయానగర్ కాలనీ శ్రీ సీతా పాలేస్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 301 లో తన భార్య సంధ్యారాణితో కలిసి నివాసం ఉంటున్నాడు. నెలరోజుల క్రితం తమ కూతురి ప్రసవం కోసం ఇంటికి తాళం వేసి వెళ్ళారు. అయితే ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం లేకపోవడం చూసి షాక్ అయ్యాడు. ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. దీంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటిలో 80 తులాల బంగారు ఆభరణాలు, రూ.10లక్షల రూపాయల విలువైన ఓ డైమండ్ నెక్లెస్, రెండు లక్షల రూపాయల నగదు ఎత్తుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## సమాచార హక్కుచట్టం కమిషనర్లను నియమించాలి : వింజమూరి గణేష్

**హైదరాబాద్, నవంబరు 29, ప్రభాతవార్త**

సమాచార హక్కుచట్టం కమిషనర్లను నియమించాలని వింజమూరి గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లోని సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ కార్యాలయంలో జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజమూరి గణేష్ మాట్లాడుతూ ఆర్టిఐ కమిషనర్ ఆఫీస్‌లో కమిషనర్‌లు లేక వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఆర్టిఐ కమిషనర్లను నియమించాలి అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ కమిషనర్లను వెంటనే నియమించాలి అన్నారు. తెలంగాణలో వివిధ రకాల ప్రభుత్వ కార్యాలయలలో ఎన్నో ఆర్టీఐ దరఖాస్తులకు సరైన సమాధానాలు ఇవ్వకుండా ఆర్టీఐ కార్యకర్తలకు అధికారులు స్పందించక నిర్లక్ష్యం చేస్తూ దరఖాస్తులు వేలల్లో పెండింగ్ లో ఉన్నాయి అని అన్నారు. ఆర్టీఐ దరఖాస్తులకు స్పందించి తక్షణమే పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, తెలంగాణ మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు గంగాప్రియ రెడ్డి, లక్ష్మిప్రియయాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిని మభ్య పెట్టి బంగారు ఆభరణాల చోరీ

**చార్మినార్, నవంబరు 29 ప్రభాతవార్త :** వృద్ధురాలిని మాటల్లో మభ్య పెట్టి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పావు తక్కువ మూడు తులాల బంగారం ఆభరణాలను దోచు కెళ్లిన సంఘటన శుక్రవారం పాతబస్తీ హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేందర్ కథనం ప్రకారం.....మంగళహాట్ ప్రాంతానికి చెందిన సునీతా దేవి (68) పాతబస్తీ చేలాపురలోని ఓ బంగారం ఆభరణాల షాపులో వెండి ఆభరణాలు కొనుగోలు చేయటానికి శుక్రవారం మధ్యాహ్నం వచ్చింది. చేలాపుర రహదారి మీదుగా సునీతా దేవి నడిచి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ వచ్చారు. మాటల్లో సునీతాదేవిని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మభ్య పెట్టారు. మా వద్ద బిస్కెట్ బంగారం ఉంది, తక్కువ ధరకు విక్రయిస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన వృద్ధురాలు సునీతా దేవి తన వద్ద ఉన్న పావు తక్కువ మూడు తులాల బంగారం ఆభరణాలను ఇచ్చింది. సునీతాదేవి ఇచ్చిన బంగారం ఆభరణాలను తీసుకుని ఆ ఇద్దరు వ్యక్తులు అక్కడ నుంచి వెళ్లి పోయారు. మోస పోయానని భావించిన సునీతా దేవి ఈ విషయాన్ని హుస్సేనీఆలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రవీంద్రభారతి స్టేజ్ అసిస్టెంట్ రహీంఖాన్ మృతి

**రవీంద్రభారతి, నవంబరు 29 ప్రభాతవార్త :** 1991 సంవత్సరం నుండి రవీంద్రభారతి ప్రధాన వేదికపై స్టేజ్ అసిస్టెంట్‌గా సమయపాలన, సత్ప్రవర్తనతో 33 ఏళ్లుగా అత్యుత్తమ సేవలందిస్తూ ప్రతీఒక్కరి మన్ననలు పొందుతున్న అందరూ ఖాన్‌భాయ్‌గా పిలుచుకొనే రహీంఖాన్ మృతిచెందాడు. గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2025 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా ఆరోగ్యం సహకరించని కారణంగా గత నెల ఐచ్చిక ఉద్యోగ విరమణ తీసుకున్నారు. రహీంఖాన్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన మృతిపట్ల తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, వివిధ సాంస్కృతిక సంస్థల అధ్యక్ష కార్యదర్శులు, రవీంద్రభారతి-భాషా సాంస్కృతికశాఖ సిబ్బంది తీవ్ర సంతాపం తెలియజేస్తూ ఖాన్‌భాయ్ ఆత్మకు శాంచిచేకూరాలని ఆకాంక్షిస్తూ ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి -ఎసిపి రమేశ్ కుమార్

**చిక్కడపల్లి నవంబరు 29 ప్రభాతవార్త:** తక్కువ సమయంలోఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో రూ.5లక్షల విలువచేసే 20 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వాటిని సరైన బాధితులకు అందించే కార్యక్రమంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌తో కలిసి ఏసీపీ అందజేశారు. సెల్‌పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని, దీని ద్వారా 20 సెల్‌ఫోన్‌లను పట్టుకున్నామని, చిక్కడపల్లి, అశోక్‌నగర్, జవహర్‌నగర్, బాగ్‌లింగంపల్లి, ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లలో సివిల్స్, గ్రూప్స్ పోటీపరీక్షల కోచింగ్ కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కోచింగ్ కేంద్రాలకు వస్తుంటారని, అదే సమయంలో సినిమా థియేటర్లను కూడా సందర్శిస్తుంటారని, సెల్‌ఫోన్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు అభిలాష, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## విద్యా,రాజకీయ రంగంలో రాణించాలి



దసరా,దీపావళి ఆత్మీయ సమ్మేళనంలో అరుంధతీ సేవా మండలి కార్యవర్గానికి సన్మానం

**బేగంబజార్,నవంబర్ 29ప్రభాతవార్త:** విద్యా,రాజకీయ రంగాల తోపాటు ఆర్థిక రంగాలలో మాదిగలు రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆరుంధతీ సేవా మండలి అధ్యక్షులు మిద్దె కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.ధర్మేందర్‌లు అన్నారు చుడీబజార్‌లోని ఆరుధీత సేవా మండలి కార్యాలయంలో దసరా,దీపావళి సమ్మేనాన్ని నిర్వహించారు.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు ఏర్పాటు చేసిన మండలిని మరింత అభివృద్ధి చేయడానికిఅందరి సహాయ సహాకారాలను తీసుకుని ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు.ఈసందర్భంగా సంఘానికి చేసిన వారిన్ని శాలువ, మెమెంటోలను అందచేసి సన్మానించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.వెంకటేష్,ఎం.చంద్రమోహన్,కోశాధికారి కె.దేవేందర్, సహాయ కార్యదర్శులు పి.హన్మంత్‌రావు, ఒ.కిషోర్, ఎస్.సంజీవ, కార్యదర్శులుబి.శ్రీనివాస్,గోపి,మహేష్,ఎం.నవీన్‌కుమార్,నాగేశ్వంరావు,ఎస్.కుమార్,దాసరి కృష్ణయ్య,పి.వెంకటేష్,సందీప్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్‌లో ప్రజాపాలన నిర్వహించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** మహిళలకోసం మహిళా భవన్ నిర్మాణం, నాయి బ్రాహ్మణుల కుల సంఘాలకు భూములు కేటాయించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అధికారులకు సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో, తహసీల్దార్‌లతో సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజవర్గంలోని ప్రభుత్వ స్థలాలను అధికారులు కాపాడాలని తెలిపారు. కోర్డు వివాదాలలో ఉన్న స్థలాల విషయంలో అధికారులు మరింత శ్రద్ద తీసుకొని ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడేలా ప్రయత్నించాలని సూచించారు. అరవ మాలలకు, మేతరులకు కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయంలోనే మంజూరు చేయాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతివార్డులో రెండు రోజుల పాటు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించవలసిందిగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, మారేడ్‌పల్లి, సికింద్రాబాద్, తిరుమలగిరి భీమయ్యగౌడ్, పాండునాయక్, అశోక్ కుమార్ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

### యశోద హాస్పత్రిలో విజయవంతంగా పల్మనరీ థ్రోంబెక్టమి ఆపరేషన్

**కంటోన్మెంట్, నవంబర్ 29 ప్రభాతవార్త:** దేశంలో మొదటిసారిగా ఊపిరితిత్తుల స్ట్రోక్ ఎటాక్ (పల్మనరీ ఎంబోలిజం) గురైన కరీంనగర్ నివాసి 20 సంవత్సరాల మాలీ రిషికేష్‌కు పల్మనరీ థ్రోంబెక్టమీ చికిత్స విజయవంతంగా జరిపినట్లు యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, కార్డియాలజిస్ట్ డాక్టర్ సి. రఘులు తెలిపారు. పలువురు వైద్య బృందంతో కలిసి చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వారు పేర్కొన్నారు.

## నేడు మాల మహానాడు రాష్ట్ర స్థాయి సదస్సు

**సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. వి.ఎల్.రాజు ఆధ్వర్యంలో ఈ నెల 30న శనివారం సాయంత్రం 2 గంటలకు బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు తెలిపారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా రాజ్యాంగ నిపుణుడు కె.వెంకట్రావు, ప్రత్యేక ఆహానితులుగా మాల మహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు రోజాలీలా, రాష్ట్ర ముఖ్యసలహాదారు డా.పి.ధర్మరాజ్ తదితరులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సదస్సులో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్‌ను జీవితాంతం వేధించి, మానసిక క్షోభకు గురిచేసిన గాంధీ కాంగ్రెస్ కాలం నుంచి సిఎం రేవంత్‌రెడ్డి వెన్నుపోటు కాంగ్రెస్ విద్రోహ విష కౌగిలి నుంచి మాల జాతిని రక్షించుకునేందుకు విస్తృతంగా చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## మేయర్ ఆధ్వర్యంలో సమావేశం..



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

**నిజాంపేట్, నవంబర్ 29, ప్రభాతవార్త**

డిసెంబర్ 2న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లి ప్రాంగణం భవన సముదాయం ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న నేపథ్యంలో మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, పోలీస్ ఉన్నత అధికారులతో కలిసి శుక్రవారం బాచుపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, పోలీస్ అధికారులతో ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఎన్ఎంసి, పోలీస్ అధికారులకు తెలియజేశారు. అనంతరం సభ స్థలం, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏసిపి శ్రీనివాసరావు, సీఐ ఉపేందర్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, ఇతర ముఖ్య అధికారులు, ఎన్ఎంసి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### హెబ్రోన్ చర్చ్ సొసైటీలో మాదే బలం : సొసైటీ చైర్మన్ కురియన్

**చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:** గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని హెబ్రోన్ చర్చ్ సొసైటీ తమ నేతృత్వంలో బలంగా ఉందని సొసైటీ చైర్మన్ కురియన్ వివరించారు. అసలైన సొసైటీ తమదేనని, తమతో పాటు జాన్ సుబ్బారెడ్డి, సాంసన్, జాన్ స్టీవర్ట్, ఏసుపాదం, పీటర్ రాయ్ తదితరుల నేతృత్వంలో బలంగా ఉందని, తమ సొసైటీతో ఎఫ్‌సిఎస్ పీటర్, రాగి వీరాచారికి స్థానం లేదని వివరించారు. శుక్రవారం గోల్కొండ క్రాస్‌రోడ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీకి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నేత అనీల్ థామస్ అనే వ్యక్తి ఈ చర్చ్ వ్యవహారంలో తలదూర్చి చివరకు ఎఫ్‌సిఎస్ పీటర్‌ను పావుగా మారారని ఆరోపించారు. నిన్నటివరకు ఎఫ్‌సిఎస్ పీటర్, రాగి వీరాచారి ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేసుకున్నారని, ఇప్పుడు వీరిరువురు బెయిల్‌పై ఉన్నారని, గత ముప్పై సంవత్సరాల నుంచి కోశాధికారిగా ఉన్న వీరిద్దరు భక్తులు సమర్పించిన కానుకలను దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

## దుండిగల్‌లో ప్రైవేటు భూములపై వక్ఫ్‌బోర్డు పెత్తనం ఏంటి..?

-వక్ఫ్‌బోర్డు పేరుతో నిషేదిత జాబితాలో పెట్టడం సరికాదు
-ప్రైవేటు భూములను నిషేదిత జాబితా నుండి తొలగించి రిజిస్ట్రేషన్లు చేయాలి: ఆకుల సతీష్



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

**దుండిగల్, నవంబర్ 29 ప్రభాతవార్త:** ప్రైవేటు భూములను వక్ఫ్‌బోర్డు పేరుతో నిషేదిత జాబితాలో పెట్టడం సరికాదని. .వెంటనే నిషేదిత జాబితా నుండి తొలగించాలని కోరుతూ ఆకుల సతీష్ శుక్రవారం కుత్బుల్లాపూర్ ఎస్ఆర్వో, దుండిగల్ తహసీల్దార్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిమైసమ్మ దుండిగల్ మండల పరిధిలో వక్ఫ్‌బోర్డు సంబంధించిన ఆస్తులు రెవిన్యూ రికార్డుల ప్రకారం 244.15ఎకరాలు మాత్రమే అన్నారు. వక్ఫ్‌బోర్డు గెజిట్ 7-ఏ, 16-02-1989 ప్రకారం దాదాపు 220 ఎకరాలు ఉన్నట్లు చూపుతూ నోటిఫికేషన్ విడుదల చేశారని దానిపై పూర్తిస్థాయిలో ప్రజల దృష్టికి తీసుకురాలేకపోయారని తెలిపారు. 2017లో టిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో ఎఫ్.నం: ఎస్-49/ఎస్ఎల్ఆర్/2017, తేది:04-10-2017 వక్ఫ్‌బోర్డు సిఇవో జిల్లా కలెక్టర్‌కు లెటర్ రాస్తూ 89గెట్ నోటిఫికేషన్ ప్రకారం రెవిన్యూ వెరిఫికేషన్ చేసి స్కెచ్‌ప్లాన్ తయారు చేసి అందజేయాలని, సంబంధిత వక్ఫ్‌బోర్డు భూములను చట్టబద్దం చేసి రిజిస్ట్రేషన్‌శాఖలో నిషేదిత జాబితాలో పొందుపరుస్తామని తెలిపారు. అయితే నాటి రెవిన్యూ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వైఖరితో వక్ఫ్‌బోర్డు సిఇవో కోరిన వివరాలను అందజేయ లేదు. దీంతో వక్ఫ్‌బోర్డు అధికారులు వారికి సంబంధించిన దాదాపు 100సర్వేనంబర్లలో విస్తరించి ఉన్న 244ఎకరాల భూమికి బదులుగా అన్ని సర్వేనంబర్లలో అదే మొత్తంలో భూమిని నిషేదిత జాబితాలో పెట్టారు. ఫలితంగా దుండిగల్ గ్రామంలోని సర్వేనంబర్లు 22,23,24,25, 26,28, 29 ,31, 75,82,83,84,88,89,91, 94,100, 101, 121,122, 123,124,125,128, 173,467,717,718, 722,723,725,728,732,733,734,736,738,739 ,740,741,746,749,823,911,912,914,917,928, 933,947,948,950,956,957,958,959 964, 965,981లలో, నాగులూర్ గ్రామంలోని సర్వేనంబర్లు 24,354,143,161,162,163లలో, కొంపల్లి గ్రామంలోని సర్వేనంబర్లు 33,34,166,179,180,181లలో గల మొత్తంగా 2వేల ఎకరాల ప్రేవేటు భూములు నిషేదిత జాబితాలోకి వెళ్ళాయని పేర్కొన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమీషనర్ అండ్ ఐజి జ్యోతిబుద్ధప్రసాద్ ప్రైవేటు భూములను నిషేదిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం ఏ విధంగా చట్టబద్దం అవుతుందని ప్రశ్నించారు. పలువురు అధికారులు నిర్లక్ష్యవైఖరి వలన సామాన్య ప్రజలు తమ సొంత భూములను రిజిస్ట్రేషన్లు చేసుకోకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రెవిన్యూ ఉన్నతాధికారులు స్పందించి వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన 244 ఎకరాల భూమిని సర్వేనంబర్ వారిగా గుర్తించి స్కెచ్‌ప్లానులు సిద్దం చేసి అంతవరకు మాత్రమే నిషేదిత జాబితాలో పొందుపరిచి మిగిలిన ప్రైవేటు భూములను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందు, అరుణ్ రావు, శ్యాంకుమార్‌రెడ్డి, మహేందర్, ఈశ్వర్‌రెడ్డి, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 2న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నిజాంపేట్, నవంబర్ 29, ప్రభాతవార్త**

హైదరాబాద్ నగరంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 39 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వచ్చే నెల డిసెంబర్ 2న అట్టహాసంగా నిర్వహించనున్నట్లు యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ముఖ్యమంత్రి, ఎ. రేవంత్ రెడ్డి, ఐటి, పరిశ్రమలు, వాణిజ్యం శాసనసభా వ్యవహారాల శాఖామంత్రి దుద్దిళ్ళ శ్రీధర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి, 2023 విశిష్ట పురస్కార గ్రహీత పద్మభూషణ్, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు డా. కె.ఐ. వరప్రసాదరెడ్డిలు హాజరు కానున్నట్లు తెలిపారు.

### అయ్యప్ప స్వామి మహా పడిపూజలో కూన శ్రీశైలం గౌడ్



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న కూన శ్రీశైలం గౌడ్

**జీడిమెట్ల, నవంబర్ 29, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 130 సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ బస్తీలో రాష్ట్ర ఐఎన్టియుసి అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వాములు పాడిన భక్తి, భజన గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ పెండ్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రమేష్ మంజుల్కర్, వీరేష్ గుప్తా, నాగరాజు, కె శంకర్, వాణి, సదానంద అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు

## శ్రీరామలింగేశ్వర దేవాలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



శ్రీరామలింగేశ్వర దేవాలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న కౌండిన్య దంపతులు.

**బేగంపేట నవంబరు 29,ప్రభాతవార్త**

కార్తీక మాసంలో భాగంగా మాస శివరాత్రిని పురస్కరించుకొని బేగంపేట ప్రకాశం నగర్ శ్రీరామలింగేశ్వర దేవాలయంలో శుక్రవారం మహన్యాన పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,లక్ష బిల్వార్చన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ఈ ఓ విఠలయ్య ఆధ్వర్యంలో పటిష్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.ఆలయ అర్చకులు మఠం సదాశివుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాలైన పూలతో అందంగా అలంకరించారు.ఈ పూజలలో కౌండిన్య,రాజశేఖర్ దంపతులు.శ్రీభూలక్ష్మి అమ్మ వారి ఆలయ నిర్మాణ దాత,సనత్‌నగర్ నియోజక వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశాల్‌సూధాం పాల్గొని పూజలు నిర్వహించారు.

### రేపు జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలి

**సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా డిసెంబరు 1వ తేదీన సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 'మాలల సింహ గర్జన సభ'లో మాలలు, మాల ఉపకులాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మహేష్‌బాబు, దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ సభ విజయవంతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌పిఐ కృషి చేస్తున్నదని, సభలు, సమావేశాలు నిర్వహించి మాలల్లో చైతన్యం తీసుకురావడం జరిగిందన్నారు. ఈ సంహ గర్జన ద్వారా మాలల బలాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని, వర్గీకరణ, క్రిమిలేయర్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, మాలలకు రాజ్యాధికారంలో వాటా కల్పించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లక్షలాది మంది మాలలు ఈ సభలో పాల్గొని మాలలు ఐక్యతను చాటాలని వారు పిలుపునిచ్చారు.

### గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

-గ్రంథాలయ అధికారి కిరణ్‌జ్యోతి

**చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:** గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కిరణ్ జ్యోతి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో 57వ అంతర్జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గ్రంథాలయ అధికారి కిరణ్ జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ మట్ట శేఖర్ ప్రసంగించారు. గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు ప్రిపేర్ కావడానికి ఉపయోగపడుతాయని అన్నారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత కోసం బ్యాంకులు ముందుకు రావడం అభినందనీయం

-ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయకుమార్



కార్యక్రమంలో పాల్గొన్న అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:**

మహిళా సాధికారత కోసం బ్యాంకులు ముందుకు వచ్చిన తోడ్పాటును అందించడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని బాపూనగర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జీహెచ్ఎంసి సంయుక్త ఆధ్వర్యంలో 'ఇందిరామహిళా శక్తి' కార్యక్రమం 'ఇందిరామహిళా శక్తి' కార్యక్రమం కింద రూ.10 లక్షల ఆర్థిక సహాయం ద్వారా నూతనంగా శ్రీసాయి స్వయం సహాయక సంఘం, బాపూనగర్ మహిళా సమాఖ్య నేతృత్వంలో క్యాంటీన్, క్యాటరింగ్ కేంద్రం ప్రారంభోత్సవం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయ కుమార్ మాట్లాడారు. మహిళా సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక బలోపేతానికి కెనరా బ్యాంకులు వంటి సంస్థలు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, జిహెచ్ఎంసి సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, డిపిఓ సుధాకర్‌రావు, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, బిజెపి నేతలు శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగరావు, ఆకుల సురేందర్, సత్తిరెడ్డి, ప్రకాశ్‌యాదవ్, బిఆర్ఎస్ ముషీరాబాద్ మీడియా ఇంచార్జ్ ముచ్చుకుర్తి ప్రభాకర్, మహిళా సంఘం, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## పోలీసుల నిర్బంధంలో శ్రీధర్



కేశబోయిన శ్రీధర్‌ను నిర్బంధంలోకి తీసుకున్న పోలీసులు

**సైఫాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:**

గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాసబ్ ట్యాంక్ వద్ద బిజెపి ఎస్సీ, ఎస్టీ, ఓ మోర్చాల ఆధ్వర్యంలో జరగనున్న నిరసన కార్యక్రమానికి తను వెళ్ళనీయకుండా నారాయణగూడ పోలీసులు శుక్రవారం గృహ నిర్బంధం చేశారని బిజెపి ఓబిసి మోర్చా గ్రేటర్ ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆరోపించారు. ఈ నిర్బంధాలు ప్రజా సంక్షేమం కోసం పోరాడే గోంతులను అణిచివేయడం ప్రజా స్వామ్యంపై నేరుగా దాడి చేయడమేనని ఆయన విమర్శించారు. బిజెపి ప్రజా సంక్షేమం కోసం అంకితాభావంతో పనిచేస్తుందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.

## నిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ

**పంజగుట్ట, నవంబర్ 29 (ప్రభాతవార్త):** తెలంగాణా వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో ఏదో ఒకటి తేలిపోవాలని ప్రకటించిన కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్షకు దిగి నేటికి 15 ఏళ్ళు పూర్తయ్యాయి. 2009 నవంబర్ 29న కేసీఆర్ దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా దీక్షా దివస్ నిర్వహిస్తుంది.ఈ సందర్భంగా నిమ్స్ ఆసుపత్రిలో బీఆర్ఎస్ నేతలు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి,మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్,ఎమ్మెల్యేలు, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఓలను బేషరతుగా రెవెన్యూ శాఖలో సర్దుబాటు చేయాలి

-తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు

**చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 5139 మంది విఆర్ఓలను ఎటువంటి షరతులు లేకుండా రెవెన్యూ శాఖలో సర్దుబాటు చేయాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29 ద్వారా విఆర్ఓ వ్యవస్థ రద్దు చేయడం జరిగిందని, జీవో 121 ద్వారా విఆర్ఓలను అర్ధరాతరి పూల లాటరీ పద్దతి ద్వారా ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా ప్రభుత్వ శాఖలలోకి అటామస్‌బాడీస్‌లోకి బలవంతంపు సర్దుబాటు చేయడంతో ఉద్యోగుల హక్కులు, మానవ హక్కులు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్ఓ, విఆర్ఏలందిరిని తిరిగి ఆప్షన్ పద్దతిలో రెవెన్యూ శాఖలోకి సర్దుబాటు చేయాలని, కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించాలని వివరించారు. గత కెసిఆర్ ప్రభుత్వం అశాస్త్రీయంగా తీసుకువచ్చిన జీవోల ఫలితంగా మహిళా తహశీల్దార్ హత్యకు గురయ్యారని, ఒక తహశీల్దార్ బలన్మరణం చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాదికొత్తగూడెం జిల్లాలో జీసీసీ విధులు నిర్వహిస్తున్న విఆర్ఓలకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికపరమైన సమస్యలతో ఇద్దరు మరణించారన్నారు. ఆగ్మగౌరవం, మానవ హక్కులు కోల్పోయామని, ఉద్యోగాలు గాలిలో ఉన్నాయని, 010 పద్దు ట్రజరీ ద్వారా వేతనాలు రావడం లేదని, సర్వీస్ రెగ్యులరైజేషన్ చేయడం లేదన్నారు. సర్వీస్ క్రమబద్దీకరణ, ప్రొబేషన్ డిక్లరేషన్ చేయడం లేదని, సొంత జిల్లాల్లో ఉన్న విఆర్ఓలను కుటుంబాలకు దూరంగా ఇతర జిల్లాలకు బదిలీ చేశారని అన్నారు. డిసెంబరు 1న హైదరాబాద్ నగర శివారులోని మేడ్చల్ జిలల్లా షామీర్‌పేట మండలం తూంకుంట గ్రామంలోని మెగుళ్ళ వెంకటరెడ్డి గార్డెన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు విఆర్ఓల బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కోర్టులో కేసు ఉండగా రోడ్డు పనులు ఎలా ప్రారంభిస్తారు?

- కోర్టు ఆదేశాలను చూపి రోడ్డు పనులు జరుపుకోవాలి
-వెనుదిరిగిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న స్వామివివేకానందనగర్ బస్తీ వాసులు

**చిక్కడపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త:** కోర్టు ఆదేశాలకు తామంతా కట్టుబడి ఉన్నామని, న్యాయస్థానం తమకు న్యాయం చేస్తుందని తామంతా ఎదురుచూపులు చూస్తున్నామని గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీవాసులు వివరించారు. పదకొండు నెలలు గడిచినా తమకు న్యాయం జరగడం లేదని బస్తీవాసులు శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాపోయారు. కూల్చివేసిన ఇళ్ళస్థలాల స్థానంలో రోడ్డు విషయంలో తాము అడ్డుకున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని, అధికారులకు బస్తీవాసులంతా సహకరిస్తున్నామని, కొందరు వక్రీకరించి వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. తమ సమస్యలకు సంబంధించి ఇంకా కోర్టులో వాదనలు జరుగుతున్నాయని, న్యాయం జరుగుతుందని తామంతా ఆశిస్తున్నామన్నారు. కోర్టులో కేసు ఉన్న సమయంలో రోడ్డు పనులు ఎలా జరుపుతారని, తాము అడ్డుకోలేదని, కోర్టు ఆదేశాలను చూపి రోడ్డు పనులు జరుపుకోవాలని కోరడంతో జిహెచ్ఎంసి అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. కోర్టు ద్వారా తమకు న్యాయం జరిగేంతవరకు పనులను నిలిపివేయాలని అధికారులను కోరామన్నారు. తమకు న్యాయంజరగాలని బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్‌పై ఆరోపణలు చేయడం మంచి సంప్రదాయం కాదని, ఇళ్ళు కూల్చిన రోజు నుంచి నేటి వరకు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ తప్ప మరే ప్రజాప్రతినిధి ఇటుపక్కన వచ్చిన తమకు మద్దతు ఇచ్చినవారు లేరన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు జ్ఞానేశ్వర్, ఎం.బి.కృష్ణ, ఆనంద్‌రావు,వసంత్, తిలక్‌రాజ్, ఎల్లమ్మ, అన్నపూర్ణ, పద్మావతి,ఇందు,పూజ, చంద్రకళ, బుచ్చమ్మ పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పగిలి రోడ్డుపాలైన మంచినీరు



మణికొండ మున్సిపల్ పరిధిలోని అల్కాపూర్ రోడ్ నెంబర్ 16.వద్ద వాటర్ పైప్‌లైన్ పగిలి వృధాగా పోతున్న మంచినీటి దృశ్యం

**నార్సింగి, నవంబర్ 29 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ రోడ్డు నెంబర్ 16.వద్ద పైప్‌లైన్ పగిలి వేల లీటర్ల మంచినీరు రోడ్డుపాలైంది. గంటల తరబడి మంచినీరు రోడ్డుపై ఏరులై పారడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విలువైన మంచి నీరు వృధా అవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు మంచినీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు నాసిరకపు పనుల కారణంగా పైపులు పగిలిపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానికులు మండి పడుతున్నారు. భవిష్యత్తులో ఇలా విలువైన నీరు వృధా కాకుండా అధికారులు పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని మణికొండ ప్రజలు కోరుతున్నారు.


**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE , CITY CIVIL COURT AT :: HYDERABAD**
**O.S.NO. 4343 OF 2024**

BETWEEN:
**K. BALAMANI ...Petitioner**
AND
**SUB-REGISTER OFFICE AND ALL CONCERN ...Respondent**
To,
**Sub-Register office,**
Sanjeeva Reddy Nagar Road, Vikaspuri, Erragada, Hyderabad-500018.
**..Respondent**

Please take notice that the above named petitioner has filed the above said petition for "SUIT FOR DECLARATION OF TITILE AND POSSESSION". The said O.S is posted to **09-12-2024** for the purpose of your appearance in the matter. Hence you are hereby requested to appear in person on **09.12.2024 at 10.30 A.M.** before the above said court, otherwise the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//

**R.K ASSOCIATES**
**B. GANGADHAR RAO**
**NOUSHEEN FATHIMA**
**VIJAYALATHA**
O/O: 1-8-855/4/1,
NALLAKUNTA, SRI RAM
HYDERABAD-500044.



వార్త VAARTHA CLASSIFIEDS **CLASSIFIEDS** వార్త VAARTHA CLASSIFIEDS

**SITUATION VACANT**

★ **Black Granite Block marker** required for Andhra/Telangana. Good salary plus expenses.
**kandoi@indiagranite.com**
**(Ro.No.32436)**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నెం. 25/EE/DIV-19/SLPZ/GHMC/2024-25, తేదీ: 29.11.2024
పనుల సంఖ్య: 2 నెం. సివిల్ పనులు, అంచనా మొత్తం రూ.లక్షలలో : 85.00, డౌన్‌లోడింగ్‌కు ప్రారంభ తేది/ముగింపు తేది మరియు సమయము: 30.11.2024న మ.2.00గం.లు, 03.12.2024న మ.2.00గం.ల వరకు మాత్రమే, అధికారి పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్-19, GHMC, శ్రీ యు.రాజ్‌కుమార్, 99635-50654. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, (SLPZ), GHMC.
DIPR.No.7266-PP/CL/Advt/1/2024-25 తేదీ: 29.11.2024



**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001**

**O.A. NO. 461 OF 2024**

**Between:**
**Union Bank of India**
**Bachupally Branch, Hyderabad -500091**
**Rep by its Branch Manager ...Applicant**
**And**
**1. M/s. Tara ECO Tech, a proprietary concern Rep by its Proprietor Mrs. S. Geetha Office at H.No.9-5-13/2, Pragathi Colony, Hasmathpet, Secunderabad, T.G. - 500009**
**.....Defendants No.1**

Whereas **O.A.No.461 of 2024** was listed before Hon'ble Registrar on **21-11-2024.**
Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of **Rs.33,53,517.86ps** (application along with copies of documents etc., annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or asset otherthen properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on **30-12-2024 at 10.30 A.M.** failing which the application shall be heard decided in your absence.
Given under my hand and seal of the tribunal on this date of 21 November 2024.
**Signature of the Authorised Officer to issue Summons**



**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001**

**O.A. NO. 465 OF 2024**

**Between:**
**Union Bank of India**
**Bachupally Branch, Hyderabad-500091**
**Rep by its Branch Manager ...Applicant**
**And**
**1 M/s Bagya Impex, a proprietary concern Rep by its Proprietor Mrs. Samba Bagya Lakshmi, Office at H.No.82-1, Tadbund, New Bowenpally, Hyderabad -500011**
**(Or)**
**H.No.51/134, Anjaiah Nagar, Gachibowli, Serilingampally, Ranga Reddy District - 500084**
**2 Mrs. Samba Bagya Lakshmi, W/o Vinay Kumar, Aged about 41 Years, Occ:Business, H.No.51/134, Anjaiah Nagar, Gachibowli, Serilingampally, Ranga Reddy District -500084 ....Defendants No.1 & 2**

Whereas **O.A.No.465 of 2024** was listed before Hon'ble Registrar on **22-11-2024.**
Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of **Rs.33,44,816.16ps** (application along with copies of documents etc., annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or asset otherthen properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on **03-01-2025 at 10.30 A.M.** failing which the application shall be heard decided in your absence.
Given under my hand and seal of the tribunal on this date of 22 November 2024.
**Signature of the Authorised Officer to issue Summons**



**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001**

**O.A. NO. 466 OF 2024**

**Between:**
**Union Bank of India, Bachupally Branch, Hyderabad -500091 Rep by its Branch Manager ...Applicant**
**And**
**1 M/s. Irya Apparels, a proprietary concern Rep by its Prop Mrs Santhoshini Sonnakula Business at 2nd Floor, Plot No.67, Sikh Road, Jupiter Colony, Secunderabad-500009**
**(Or)**
**Office at H.No.3-4-308/7, Lingampally, Opp: Shanti Niketan High School, Kachiguda, Hyderabad-500027**
**2 Mrs. Santhoshini Sonnakula, W/o.S.Sukumar, Aged about 46 years, Occ: Business,R/o H.No.3-4-308/7, Lingampally, Kachiguda, Hyderabad-500027 .....Defendants No.1 & 2**

Whereas **O.A. No. 466 of 2024** was listed before Hon'ble Registrar on **22-11-2024.**
Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of **Rs.32,65,188.86ps** (application along with copies of documents etc., annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or asset otherthen properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on **03-01-2025 at 10.30 A.M.** failing which the application shall be heard decided in your absence.
Given under my hand and seal of the tribunal on this date of 22 November 2024.
**Signature of the Authorised Officer to issue Summons**

## మైత్రి నగర్‌లో సిసి రోడ్డు నిర్మాణం


అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ మైత్రి నగర్ కాలనీలో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నప్పటికీ గత పాలకులు పట్టించుకోలేదన్నారు. పార్టీలకు అతీతంగా డివిజన్‌లో తాము అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. డివిజన్‌లోని సమస్యలను తన దృష్టికి తీసకువచ్చి వాటి పరిష్కారానికి తోడ్పాటు నందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ కార్తీక్, డిఇ రవిచంద్ర, ఎఇ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుపండుగ మహాసభను విజయవంతం చేయాలి : మధుసూదన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చిలుక మధుసూదన్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తోందని, దేశంలో రైతన్నలకు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కారుకే దక్కిందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లా అమీస్తాపూర్‌లో నిర్వహించనున్న రైతుపండుగ మహాసభను పురస్కరించుకుని శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మిగతా రైతులకు కూడా రుణమాఫీ చేస్తారని తెలిపారు. తెలంగాణ వరి దిగుబడిలో దేశంలోనే మొదటి స్థానంలో నిలచిందని, రైతులు పండించిన సన్నాలకు 500 రూపాయల బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో 30న సాయంత్రం నిర్వహించే రైతుపండుగ మహాసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని రైతులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ భాస్కరచారి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## పార్కుల అభివృద్ధి కి కృషి: కార్పొరేటర్ లచ్చిరెడ్డి


పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. నవంబర్ 29.ప్రభాతవార్త** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ ఫేస్ 1 పార్క్ లో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ పరికరాలను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ,జిహెచ్‌ఎంసి ఈఈ ఆశలత ,డిఈ దామోదర్ రావు లతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంతో పాటు,యువకులకు శారీరక ధారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి పార్కులను అన్నీ రకాలుగా అభివృద్ధి పరుస్తున్నామని అందులో భాగంగా పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను పర్యవేక్షించడం జరిగిందని అన్నారు. ఒకటి ఒకటిగా డివిజన్ పరిధిలోని ప్రతి పార్కు అభివృద్ధి పరిచేల చర్యలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ ఎంసి ఏఈ రాజ్ కుమార్, బి.యన్ రెడ్డి నగర్ ఫేస్ 1 అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, పోచమ్మతల్లి దేవాలయ చైర్మన్ ప్రదీప్ రెడ్డి, రాములు, శ్రీనివాస్ గౌడ్,రవి కుమార్, నర్సి రెడ్డి, గోపాల్ మరియు పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం సెక్రటరీ పవన్ కుమార్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ భవన్‌కు తరలిన సైదాబాద్ బిఆర్ఎస్ నాయకులు


ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత

**సైదాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ చరిత్రను కెసిఆర్ చేపట్టిన దీక్ష మలుపు తిప్పిందని సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన దీక్ష దివస్ వేడుకలకు సైదాబాద్ డివిజన్ నుంచి సింగిరెడ్డి స్వర్ణలత రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. బైక్ ర్యాలీని జండా ఊపి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్, నందు, పరమేష్,శ్రీకాంత్, రమేష్, శంకర్, చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

### దిక్షా దివస్ కార్యక్రమానికి తరలివెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు


దీక్షా దివస్‌లో కూర్చున్న నాచారం బీఆర్ఎస్ నేతలు

**నాచారం, నవంబర్ 29 ప్రభాతవార్త:** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం గండి మైసమ్మ ప్రాంతంలో శుక్రవారం ఏర్పాటు చేసిన దీక్షా దివస్ కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్ శ్రేణులు నాచారం నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ రాష్ట్రం వచ్చుడో కేసీఆర్ సచ్చుడో ఏదో ఒకటి తేలిపోవాలని ప్రకటించిన కేసీఆర్ ఆమరణ నిరహార దీక్షకు దిగి నేటికి 15 ఏళ్లు పూర్తి అయ్యిందన్నారు. దీనిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు

# ఘనంగా దీక్షా దివస్


యాకుత్‌పుర నియోజకవర్గ నాయకులతో సామ సుందర్‌రెడ్డి, ఆజం అలీ


కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జహీర్‌ఖాన్, పాండుగౌడ్


దీక్షా దివస్ సమావేశానికి ర్యాలీగా తరలివెళుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**యాకుత్‌పుర నియోజకవర్గం..**

**సైదాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ వాసుల ప్రత్యేక రాష్ట్ర సాధన కళ కెసిఆర్‌తోనే సాధ్యమయిందని యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. యాకుత్‌పుర నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్‌ల నుంచి సామ సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దీక్ష దివస్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లకు చెందిన నాయకులు నాయకులు పాల్గొన్నారు.

**కొత్తపేట డివిజన్‌లో...**

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** శాంతియుత మార్గం ద్వారా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించాలని టిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీర్ ఖాన్, రంగారెడ్డి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాండుగౌడ్ పేర్కొన్నారు. దీక్షా దివాస్ సందర్భంగా కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి వారు పాలాబిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అనంతరం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, పిట్టా సాయి, అఖిల్, శ్రీను పాల్గొన్నారు.

**ఉప్పల్ సర్కిల్ నుండి దీక్షా దివస్‌కు..**

**ఉప్పల్, నవంబరు 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధన సమరంలో మలుపుతిప్పిన దీక్షా దివస్ అమరణ నిరహారదీక్ష పూర్తయి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మేడ్చల్‌లో నిర్వహిస్తున్న దీక్షా దివస్ కార్యక్రమానికి ఉప్పల్ సర్కిల్ నుంచి పలువురు పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్,శాంతి సాయిజెన్ శేఖర్, పార్టీ నేతలు సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, గోల్లూరి అంజయ్య పలువురు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన సమరంలో దీక్షా దివస్ అమరణ దీక్ష ఒక మలుపు తిప్పిందన్నారు.

దీక్షా దివస్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెసిఆర్‌తోనే ప్రత్యేక రాష్ట్రం : బిఆర్ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆజం అలీ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆజామ్ అలీ, తీగల అజిత్ రెడ్డి, హయ్యత్ హుస్సేన్ హబీబ్ తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 29, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందని బిఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి, ఆజం అలీ, మలక్ పేట్ నియోజకవర్గం బి ఆర్ఎస్ ఇంచార్జ్ తీగల అజిత్ రెడ్డిలు పేర్కొన్నారు. దీక్ష దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అక్బర్ బాగ్ దిల్ కుశ ఫంక్షన్ హాల్ లో చావుని డివిజన్ బిఆర్ ఎస్ అధ్యక్షుడు, కేసీఆర్ సేవాదళం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు హయత్ హుస్సేన్ హబీబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన, కంటి వైద్య శిబిరాలను వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009వ సంవత్సరం నవంబర్ 29వ తేదీన కేసీఆర్ ఏం నిరాహారదీక్ష చేపట్టడంతో అప్పట్లో కేంద్ర మంత్రిగా ఉన్న చిదంబరం డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం జరిగిందని, కెసిఆర్ సారధ్యంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గం బి ఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి లయక్ ఆలీ,మాజీ వైస్ చైర్మన్ భూమేష్, డివిజన్ అధ్యక్షులు జగన్, మారుతి, పగిల శ్రీనివాస్ రెడ్డి, కామేష్, నాయకులు గౌర శశిధర్, శ్రీధర్ రెడ్డి, టిన్ను సింగ్ తదితరులు పాల్గొన్నారు. భారీ ర్యాలీగా తెలంగాణ భవన్ తరలిన నాయకులు బి ఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్య దర్శి ఆజం అలీ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా తెలంగాణ భవన్ కు తరలివెళ్లారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం : ఎమ్మెల్యే బలాల


అజం పుర క్లాక్ టవర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బలాల చిత్రంలో అబ్రార్, అలీం తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 29, ప్రభాతవార్త:** మలక్ పేట్ నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బాలల పేర్కొంటున్నారు.మలక్ పేట నియోజకవర్గం అజంపురా డివిజన్ లోని వివిధ ప్రాంతాలలో రూ. 3.54 కోట్లతో నిర్మించిన క్లాక్ టవర్ , వర్టికల్ గార్డెన్ ,ఆర్ యు బి బ్రిడ్జ్ ,సిసి రోడ్లు కమ్యూనిటీ హాల్ తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల స్థానిక నాయకులు అబ్రార్, అలీమ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్ పేట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అజం పురాలో నూతనంగా ఏర్పాటు చేసిన క్లాక్ టవర్ ,వర్టికల్ గార్డెన్ తో నూతన శోభను సంతునించుకుంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కాలనీలను, బస్తీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంది వారి సంక్షేమాన్ని కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ప్రతినిత్యం స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానికుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కైసర్, అనాస్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో వాస్తవ పరిస్థితులపై సిఎం సమీక్ష జరపాలి : అందెల డిమాండ్


హాస్టల్‌లో అపరిశుభ్ర పరిస్థితిపై అసహనం వ్యక్తం చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలల్లో వాస్తవ పరిస్థితులపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరపాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ చోట్ల ఇటీవల విద్యార్థులు కలుషిత ఆహారం వల్ల అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోనున్న కందుకూరు గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి భోజనశాలను, కిటికీల వద్ద అపరిశుభ్ర పరిస్థితులను, టాయిలెట్లను పరిశీలించారు. అదే విధంగా అస్వస్థతతో విశ్రాంతి తీసుకుంటున్న ఒక విద్యార్థితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకులాల సక్రమంగా నిర్వహణ జరగాలంటే స్థానికంగా ఉన్న నేతలతో ప్రత్యేక కమిటీ వేయాల్సిన అవసరం ఉందన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు చాలా సమస్యలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సిఎం ఉన్నత స్థాయిలో సమీక్ష జరిపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్లు పెత్తుల్ల పుల్లారెడ్డి, తోట ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఏనుగు రాంరెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, నిమ్మల రవికాంత్‌గౌడ్, మంత్రి మహేష్ ముదిరాజ్, యాతం వెంకటేష్ పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం పరిశీలించిన ప్రజావాణి ప్రతినిధులు


పాఠశాలలో మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకుంటున్న ప్రజావాణి సంస్థ ప్రతినిధులు

**రామంతాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త :** రామంతాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును ప్రజావాణి స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు పరిశీలించారు. సంస్థ నిర్వహకులు ఎర్రం శ్రీనివాస్, సిపిఎం నేత భీష్మాచారి, కుమారస్వామి, మైత్రీ ఎస్సీ ఎస్టీ సంఘం నేతలు విజయ్‌కుమార్, డాన్ బిక్షపతి, జి.నరేందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పాఠశాలలో 307 హైస్కూల్ విద్యార్థులు, 715 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. స్కూల్‌లో సరిపడే క్లాస్ రూమ్‌లు లేవని, మంచినీటి నల్లా ఉన్నా నీరు సరిపోక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. భోజనం తయారు చేసేందుకు గది లేక బహిరంగ ప్రదేశంలో వంట చేస్తున్నారని,వర్షం వచ్చిన సమయంలో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.అధికారులు స్పందించి తగు చర్యలుతీసుకోవాలని కోరారు.

### విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నర్సింహారావు

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నర్సింహారావు అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలోనున్న లార్డ్స్ హై స్కూల్‌లో లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిల వినతి మేరకు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్‌టిట్యూట్ శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ ట్రాఫిక్ రూల్స్, సురక్షిత ప్రయాణం తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రిన్సిపల్ మరియన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శివసాయినగర్‌లో మృత్యుంజయ హోమం

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** పవిత్ర కార్తీక మాసంలోని మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్‌లోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, లక్ష్మీగణపతిరావుల ఆధ్వర్యంలో హోమాన్ని వేదమంత్రోచ్చారణతో జరిపారు. హోమం అనంతరం శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.


మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

### ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం
-ఛైర్‌పర్సన్ జయశ్రీరాజు


కమ్యూనిటీ హాలు శంకుస్థాపనలో ఛైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

**హయత్‌నగర్, నవంబరు 29 ప్రభాతవార్త:** లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 7వ వార్డులో 40లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మినీ ఫంక్షన్‌హాలు (కమ్యూనిటీ హాలు)కు ఆమె స్థానిక కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాలనీలలోని పార్కు స్థలాలలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన మేరకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్‌పర్సన్ చామసంపూర్ణా విజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, బొర్ర అనురాధసురేష్, కో-ఆప్షన్ సభ్యులు ఖలీమ్ పాల్గొన్నారు.

### కుష్టు వ్యాధి గుర్తింపు, నిర్మూలనపై శిక్షణా కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్. వెంకటేశ్వర్ రావు

**హుడా కాంప్లెక్, 29 నవంబరు ప్రభాతవార్త :** జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమం, ఎల్సిడిసి కార్యక్రమం పై జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సరూర్ నగర్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ . వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, డిసెంబర్ నెల 2 వ తేది నుండి 15 వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. ఆశ కార్యకర్తలు ఉదయం ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి అందరిని లేప్రోసి వ్యాధి లక్షణాలకోసం పరీక్షలు చేస్తారని, అనుమానం ఉన్నవారిని దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారని చెప్పారు. ప్రతీ ఒక్కరు అంకితభావంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి, డా. పాపా రావు మాట్లాడుతూ వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిపించారు. జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమంలో ప్రతీ రోజు, సర్వే చేసే విధానం, రిపోర్టు తయారు చేసే పద్ధతి వివరించారు. ఈ కార్యక్రమం లో జిల్లాలోని వివిధ ప్రోగ్రాం అధికారులు, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు లేప్రోసి సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

### సిఎం సహాయనిధి పేదలకు వరం : పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, నవంబరు 28 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సిఎం సహాయనిధికి చెక్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కృష్ణారెడ్డి, ఈగ అంజనేయులు, శ్రీకాంత్‌గౌడ్, లుకాస్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, నవీన్‌యాదవ్, కృష్ణారెడ్డి, బ్రహ్మచారి, మధు తదితరులు పాల్గొన్నారు.

### డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి : శ్రీవాణి


జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి

**రామంతాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, చెరువుల అభివృద్ధితోపాటు, నాలాల సుందరీకరణ, సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఆధునీకరణ, పైప్‌లైన్ల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరారు. ఇప్పటికే అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించి పంపించినట్లు తెలిపారు. త్వరలోనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## మందకృష్ణకు క్షమాపణలు చెప్పాలి

-లేనిపక్షంలో డిసెంబర్ 3న జరిగే వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని అడ్డుకుంటాం : వి హెచ్ పి ఎస్

**మలక్ పేట ,నవంబర్ 29, ప్రభాతవార్త:** ఎంఆర్పిఎస్ జాతీయ నాయకుడు, వి హెచ్ పి ఎస్ గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ కు బే షరతుగా క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో డిసెంబర్ 3న జరిగే ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని వి హెచ్ పి ఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ ,జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబులు హెచ్చరించారు. శుక్రవారం మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ముందు వికలాంగుల సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య క్షమాపణలు చెప్పాలంటూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ బిజెపికి అమ్ముడుపోయారని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఛైర్మన్ ముత్తినేని వీరయ్య వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ప్రభంజన్ రావుకు వినతిపత్రాన్ని అందజేసి ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ పిఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు భవాని చౌదరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పంతంగి మంగమ్మ, ఎల్. గోపాల్ రావు, సత్యనారాయణ, కాళ్ళ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### మంద కృష్ణ మాదిగను అగౌరవ పర్చలేదు : చైర్మన్ వీరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 29, ప్రభాతవార్త :** జాతీయ నాయకులు మంద కృష్ణ మాదిగను తాను అగౌరవ పరచలేదని వికలాంగుల సహకార సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు కావాలని రాద్ధతం చేస్తున్నారని తెలిపారు. కొన్ని అంశాల గురించి మంద కృష్ణ ను రాజకీయంగా తాను ప్రశ్నించడం జరిగిందని, మందకృష్ణను ప్రశ్నించడం తప్పు అని అన్నారు. కానీ కొందరు తనను ఉదేశ్యపూర్వకంగా దుర్భాషలాడడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల హక్కుల కోసం, వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా కలిసి పని చేద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ గుత్తికొండ, మహిళా వికలాంగుల సాధికారత వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కోల రాజ్యలక్ష్మి, నాయకులు సురేష్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహాలింగార్చన


మహాలింగార్చనలో పాల్గొన్న లింగాల నాగేశ్వరరావు

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** కార్తీకమాసం ఆఖరి శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా మహ లింగార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తపేట మారుతినగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో దేవాలయం ప్రధాన అర్చకుడు గుండేపూడి సుధీర్‌శర్మ పౌరోహిత్యంలో దేవాలయంలో శుక్రవారం రాత్రి లక్ష బిల్వార్చన, మహ లింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. 365 లింగాలకు అభిషేకాలు చేయడంతో పాటు దీపాలను ఏర్పాటు చేసి శివలింగాలకు అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలోమాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, దేవాలయం ప్రతినిధుల మురళీధర్ రావు, మల్లేశం,సుబ్బారాయుడుశర్మ,కామేశ్వరరావు పాల్గొన్నారు.

## త్రిపుర గవర్నర్ నల్లుకు సత్కారం


గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న సురేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** నాగోల్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనంతల సురేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్, తోట మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రేటర్ కమిషనర్‌తో కాంగ్రెస్ ఇంచార్జీ పరమేశ్వర్‌రెడ్డి బేటి


గ్రేటర్ కమిషనర్ ఇలంబర్తితో బేటి అయిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం. పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 28 ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తితో శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి బేటి అయ్యారు. ఈ మేరకు కమిషనర్‌ను కలిసి పలు అంశాలు చర్చించారు. ఉప్పల్‌లో రూ.101 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఎస్ఎన్‌డిపి పనుల ప్రారంభోత్సవం గురించి చర్చించినట్లు తెలిపారు. నాలాల అభివృద్ధి కోసం ఎన్ఎన్‌డిపి కింద డ్రైన్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈసినగర్ నుంచి రాంపల్లి చెరువు వరకు రూ.37 కోట్లు, నాచారం పెద్ద చెరువు నుంచి నల్ల చెరువు వరకు రూ.22 కోట్లు, రామంతాపూర్ నుంచి ఒయు వరకు 12.6 కోట్లు, కాప్రా విఐపి గోదాం నుంచి సాకేత్ వరకు రూ.29 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే సిఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. పలు అభివృద్ధి పనులను నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డితోపాటు, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ గ్రామానికి చెందిన రామిడి పద్మారెడ్డికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.60 వేలు మంజూరైంది. ఈ మేరకు ఆయన శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి చేతుల మీదుగా సిఎంఆర్ఎఫ్ చెక్కును అందుకున్నారు.